కథ

# ధైర్యే సాహసే లక్ష్మీ

**రాచపూటి రమేష్**

**ఆదివారం సాయంత్రం సికింద్రాబాదు రైల్వేస్టేషను ప్రయాణికులతో సందడిగా వుంది. అన్ని ప్లాట్‌ఫామ్‌లూ నిండుగా కళకళలాడుతూ వున్నాయి.**

మూడో నెంబరు ప్లాట్‌ఫామ్‌పై ఒక చెక్క బెంచీపై దిగాలుగా కూర్చుని వున్నాడు రాజేంద్ర. అతనెక్కవలసిన ట్రైను ఇంకా ప్లాట్‌ఫామ్‌పైకి రాలేదు. మరో అరగంటలో చెన్నైకి బయలదేరవలసిన ఎక్స్‌ప్రెస్‌లో అతను ప్రయాణించి నెల్లూరులో దిగాలి. అక్కడ నుంచీ రాజేంద్ర వుంటున్న పల్లెటూరికి గంటన్నర ప్రయాణం. రిజర్వేషను వుంది కాబట్టి బెర్త్ గురించి సమస్య లేదతనికి.

సీఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్ ఎంపికకు హాజరయ్యాడు రాజేంద్ర అదే రోజు ఉదయం. రాత పరీక్షలోని మార్కుల ఆధారంగా ఫిజికల్ ఫిట్‌నెస్ రౌండుకి పిలిచారు. రాజేంద్రకు ఎటువంటి రిజర్వేషనూ లేదు. ఓపెన్ కేటగరీలో వున్న ఉద్యోగాలు తక్కువ. రన్నింగ్ కోసం రెండు నెలలుగా ప్రాక్టీసు చేస్తున్న రాజేంద్ర ఇంటర్వ్యూ సమయంలో పెట్టిన పోటీలో తన శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు. అరగంటలో ఐదు కిలోమీటర్ల దూరం పరుగెత్తాలి. రాజేంద్రతోబాటు మరో అభ్యర్థి కూడా ఒకే సమయంలో లక్ష్యాన్ని అధిగమించాడు. ఆ అభ్యర్థి వయసు రాజేంద్రకన్నా రెండు నెలలు ఎక్కువవడంతో పోస్టు అతనికి కేటాయించారు. నిరాశతో వెనుదిరిగాడు రాజేంద్ర. ఈ ఏడాదితో ఆ ఉద్యోగాలకు కూడా అతని వయోపరిమితి దాటిపోతూ వుంది. ట్రైన్ రావడంతో ఎక్కి తనకలాట్ చేసిన సీట్లో కూర్చున్నాడు.

'ఎక్స్‌క్యూజ్‌మీ' అన్న పిలుపుతో ఉలిక్కిపడ్డాడు రాజేంద్ర. యాష్ కలర్ సఫారీ సూట్‌లో వున్న ఒక వ్యక్తి చేతిలో ఒక సూట్‌కేస్‌తో రాజేంద్ర ముందు నిలబడి వున్నాడు. రాజేంద్ర అతని వంక ఆశ్చర్యంగా చూశాడు.

''మీరు నాకొక చిన్న హెల్ప్ చేయాలి. ఎస్-5 బోగీలో ముప్పై మూడవ నెంబరు సీటు మీదేనా?'' రాజేంద్ర సీటు మీద వున్న బెర్త్‌నెంబరు చూస్తూ అన్నాడతను.

''ఔను, ఏం, ఎందుకడుగుతున్నారు?'' మరింత ఆశ్చర్యంగా అడిగాడు రాజేంద్ర.

''చార్ట్‌లో చూశాను. మీరు నెల్లూరు వరకూ ప్రయాణిస్తున్నారనుకుంటాను'' అన్నాడతను వినమ్రంగా.

''ఔను, ఐతే ఏం?'' ఈసారి కొంత విసుగ్గా అన్నాడు రాజేంద్ర.

''మరేం లేదు. నెల్లూరులో ఎల్లుండి ఉదయం మా కజిన్ పెళ్లి వుంది. పెళ్లికి సూటు హైదరాబాదులో ఆర్డరిచ్చాము. ఐతే టైలరు ఆలస్యంగా ఆ సూటును రెడీ చేసి ఇచ్చాడు. నాకాఫీసులో అర్జెంటు మీటింగ్ వుండడంతో ఈరోజు నెల్లూరుకు బయల్దేరలేకపోతున్నాను. స్టేషన్‌కు మా బ్రదర్ వస్తారు. మీకభ్యంతరం లేకపోతే ఈ సూట్‌కేసును నెల్లూరులో మా బ్రదర్ కప్పజెప్పగలరా? రేపు సాయంత్రం రిసెప్షన్‌లో పెళ్లికొడుకు ఈ సూట్‌ను వేసుకోవలసి వుంది'' రాజేంద్ర వంక అభ్యర్థనగా చూస్తూ చెప్పాడు సఫారీ సూట్ వాలా.

రాజేంద్ర విసుగ్గా మొఖం పెట్టాడు. 'ఎందుకు తనకీ లంపటం అనవసరంగా' అన్నట్లుగా.

ఆ వ్యక్తే మళ్లీ చెప్పాడు. ''మీరు వూరికినే మాకీ సర్వీస్ చెయ్యనక్కర్లేదు. ఈ రెండు వందలుంచండి. పని జరగడం ముఖ్యం''

రాజేంద్ర ముఖంలో మార్పు వచ్చింది. నిరుద్యోగైన తనకు ఆ రెండు వందలు ఏదో ఒక ఖర్చుకు ఉపయోగపడతాయి. కానీ ఈ వ్యక్తిని ఎంతవరకు నమ్మచ్చు? మనిషి హుందాగానే వున్నాడు.

రాజేంద్ర ముఖంలోని భావాలు చదివినట్లు చెప్పాడతను.

''మీరేమీ డౌట్లు పెట్టుకోనక్కర్లేదు. మీకనుమానంగా వుంటే సూట్‌కేసు తెరచి చూపిస్తాను'' అని సీటుపై సూట్‌కేసును తెరిచాడు. మడతలు పెట్టి ఇస్త్రీ చేయబడిన బ్రౌన్ కలర్ సూట్ అందంగా మెరుస్తోందందులో.

రాజేంద్ర తృప్తిగా తలాడించడంతో ఆ వ్యక్తి సూట్‌కేసును లాక్ చేసి తాళాలతోబాటూ రాజేంద్రకందజేశాడు.

''మా బ్రదర్‌కు ఫోన్ చేసి చెప్తాను. బోగీ దగ్గరకే వస్తాడతను. నాలాగే సఫారీ సూట్ వేసుకోమని చెప్తాను మీరు గుర్తుపట్టుకునేందుకు వీలుగా. మీరు ట్రైన్ దిగి ఓ ఫైవ్ మినిట్స్ అక్కడే వెయిట్ చేయండి'' చెప్పాడతను రాజేంద్రకు రెండు వంద రూపాయల నోట్లను అందజేసి వీడ్కోలు తీసుకుంటూ.

రాజేంద్ర యధాలాపంగా ఆ సూట్‌కేసును ఎదుటి బెర్త్ క్రిందకు తోశాడు. ఎదుటి సీట్ చివర్లో ఖద్దరు షర్టు, తెల్లటి పంచెలో నుదుటిన వీభూతి రేఖలతో వున్న ఒక అరవై ఏళ్ల పెద్దాయన భగవద్గీత బౌండుపుస్తకం చదువుకుంటూ వున్నాడు. రాజేంద్ర, సఫారీ సూట్‌లోని వ్యక్తి సంభాషణను ఆయన గమనించనే లేదు.

ట్రైన్ కదిలే సమయం ఆసన్నమవడంతో ప్రయాణీకులు ఒకరొకరిగా కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించసాగారు. రాజేంద్ర కూర్చున్న సీట్ పక్కనే భారీ శరీరం, కోరమీసాలతో వున్న ఒక నలభై ఏళ్ల వ్యక్తి వచ్చి కూర్చున్నాడు. మరో రెండు నిమిషాల్లో ట్రైన్ కదులుతుందనగా పిల్లికళ్లతో వున్న మరో యువకుడు ప్రవేశించి రాజేంద్ర ఎదురుగా కూర్చున్నాడు. ఎవరి లగేజి వాళ్లు బెర్త్‌ల కింద సర్దుకున్నారు.

పెద్దగా విజిల్ వేసుకుంటూ ట్రైన్ కదిలింది. తినుబండారాలూ, టీలూ అమ్మేవాళ్లు కేకలు వేసుకుంటూ అటూ ఇటూ తిరుగుతున్నారు. ప్రయాణీకులు సీట్లలో సర్దుకొని పిచ్చాపాటీ కబుర్లలో పడ్డారు.

పిల్లికళ్ల యువకుడు తన బేగ్‌లోంచి చిప్స్‌పాకెట్ తీసి తినబోతూ రాజేంద్రకాఫర్ చేశాడు. మొహమాటంగా వద్దన్నాడు రాజేంద్ర.

''ఔన్లెండి, ఈకాలం ప్రయాణాల్లో మన జాగ్రత్తలో మనముండటం మంచిది, ఎవర్నీ నమ్మలేం'' నవ్వుతూ చెప్పాడా యువకుడు.

''అదేం కాదు, నాకు తినాలని లేదు'' నవ్వుతూనే సమాధానమిచ్చాడు రాజేంద్ర. చిప్స్ తింటూ వసపిట్టలాగా రాజకీయాల గురించీ సినిమాలూ క్రికెట్ గురించీ ఏవేవో వాగుతూనే వున్నాడతను. 'బాగా కలుపుగోలుమనిషి' అనుకున్నాడు రాజేంద్ర. విభూతి రేఖల వ్యక్తి, రాజేంద్ర కూడా చురుగ్గా సంభాషణలో పాల్గొనసాగారు.

'బస్సులో కన్నా ట్రైన్ జర్నీ బావుంటుంది. ఇలాగే మంచి కాలక్షేపం ఐపోతుంది' అనుకున్నాడు రాజేంద్ర. రాజేంద్ర ప్రక్కన కూర్చున్న కోరమీసాల వ్యక్తి మాత్రం కళ్లు మూసుకొని



జోగుతూ వున్నాడు.

ట్రైన్ ఏదో స్టేషన్లో ఆగింది. పిల్లికళ్ల వ్యక్తి వాటర్ బాటిల్ పట్టుకొని బయల్దేరుతూ ''మీకూ నీళ్లు పట్టుకురావాలా'' అని అడిగాడు రాజేంద్రను. ఆసరికి ఖాళీ అయిన నీళ్ల సీసా అతని కందించాడు రాజేంద్ర.

''ఏం చేస్తూ వుంటారు? ఎక్కడుంటారు మీరు?'' అడిగాడు ఖద్దరు చొక్కా వేసుకున్న వీభూతి రేఖల వ్యక్తి. ఆయన పేరు అనంతరామయ్య అట.

రాజేంద్ర క్లుప్తంగా తన పరిస్థితి వివరించాడు. నిజానికి చాలా ఇబ్బందుల్లో వుంది రాజేంద్ర కుటుంబం.

ఏడాది క్రితం గుండెపోటుతో అతని తండ్రి మరణించాడు. అది జరిగిన మూడు నెలలకు డిగ్రీ చదువుతున్న రాజేంద్ర తమ్ముడు సైకిల్‌మీద కాలేజీకి వెళ్తూ బస్ యాక్సిడెంట్లో తీవ్రంగా గాయపడ్డాడు. రెండుకాళ్లకూ, ఎడమచేతికి బలమైన గాయాలయ్యాయి. వేలూరులోని హాస్పిటల్లో అడ్మిట్ చేయించి రెండు నెలలు ట్రీట్‌మెంట్ ఇప్పించారు. ఇంటి ఖర్చులకూ, తమ్ముడి హాస్పిటల్ ఖర్చులకూ, వున్న ఆరెకరాల్లో రెండు ఎకరాలు ఏదో ఒక రేటుకు తెగనమ్ముకోవలసి వచ్చింది. మరో రెండు నెలల్లో రాజేంద్ర చెల్లెలి పెళ్లి వుంది. కట్నం డబ్బులకూ, పెళ్లి ఖర్చులకూ మరో రెండెకరాలు అమ్మడం తప్ప గత్యంతరం లేదతనికి. ఇక తండ్రి వ్యవసాయ ఖర్చులకు చేసిన అప్పులు చాలానే వున్నాయి. బాకీదారులు ఈసరికే గొంతుమీద కూర్చుని వున్నారు. వారి ఒత్తిడికి మిగిలిన రెండకరాలు అమ్మి బాకీలు తీర్చక తప్పదు. ఉన్న పొలమంతా హారతి కర్పూరంలా కరిగిపోతే రాజేంద్ర కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా మారక తప్పదు.

రాజేంద్ర మాటలు విని అనంతరామయ్య భారంగా నిట్టూర్చాడు.

''ఒకే ఏడాది రెండు షాకులను భరించాలంటే ఎవరికైనా కష్టమే కదండీ'' తండ్రి చావు, తమ్ముడి ఏక్సిడెంట్ దృష్టిలో పెట్టుకొని అన్నాడు రాజేంద్ర.

అనంతరామయ్య చిన్నగా నవ్వి రాజేంద్ర కుడి చేతిని తీసుకుని ఐదు నిమిషాల పాటు దీక్షగా పరిశీలించాడు. ఆ సరికి వాటర్ బాటిల్ తీసుకొచ్చి రాజేంద్రకిచ్చిన పిల్లికళ్ల వ్యక్తి కూడా వారి సంభాషణను ఆసక్తిగా వినసాగాడు.

రాజేంద్రను కొన్ని ప్రశ్నలు వేసి అనంతరామయ్య చెప్పాడు. ''హస్తసాముద్రికం, జ్యోతిష్యం నా వృత్తి. ఒకేసారి రెండు అశుభాలు జరిగినట్లే, అనుకోకుండా అదృష్టం కూడా

రెండుసార్లు కలిసి రావచ్చు. మీ కష్టాలన్నీ త్వరలో తీరిపోయే యోగం కనిపిస్తోంది మీ చేతిలో. ధైర్యంగా వుండండి'' అన్నాడు.

రాజేంద్ర వేదాంతిలా నవ్వాడు. ''కష్టాల పడవలో ప్రయాణం చేస్తున్న వాణ్ణి. ఈ జోస్యాలన్నీ నమ్మే స్థితిలో లేను'' అన్నాడు.

అనంతరామయ్య భుజాలెగరేసి చెప్పాడీసారి ''ఏ జోస్యము చెప్పింది చెప్పినట్లు జరగదు. నీకు అదృష్టయోగంతో బాటు కృషీ, ధైర్యసాహసాలూ కూడా తోడవ్వాలి. సుఖాల్లో వున్నప్పుడు మనిషి ధైర్యంగా వుండకపోయినా ఫర్వాలేదు. కానీ కష్టాల్లో వున్నప్పుడు మాత్రం అనుక్షణం అప్రమత్తంగా, ధైర్యము, తెగింపుతో వాటిని ఎదుర్కోవాలి. సాహసంతో అధిగమించాలి. లేకపోతే జీవితమే కష్టాల మయమైపోతుంది. దేవుడు నీకు శుభం చేస్తాడు''

ఈసారి రాజేంద్ర చిన్నగా నవ్వి వూరుకున్నాడు. రాత్రి ఎనిమిది గంటలు దాటడంతో ప్రయాణీకులంతా వారితోబాటు తెచ్చుకున్న ఫలహారం పేకెట్లు తీసుకొని తినసాగారు. రాజేంద్ర ఒక స్టేషన్లో హాకర్ అమ్ముతున్న పూరీ పేకెట్టు తీసుకొని, టిఫిన్ ముగించాడు.

తొమ్మిది దాటుతూనే కోరమీసాల బలాఢ్యుడు, బెర్త్‌లను తెరిపించి తనకలాట్ చేసిన మిడిల్ బెర్త్‌లో నిద్రకుపక్రమించి పది నిమిషాల్లోనే గుర్రుపెట్టి నిద్రపోసాగాడు. అనంతరామయ్య, పిల్లికళ్ల వ్యక్తి, రాజేంద్ర కూడా వారి వారి బెర్తులలో చేరుకున్నారు. కళ్లు మూసుకున్నడన్న మాటే గానీ రాజేంద్రకు బొత్తిగా నిద్ర రాలేదు. చెల్లెలి పెళ్లి ఖర్చుల్లో యాభై వేల రూపాయలు తక్కువ పడుతోంది. రెండెకరాలమ్మినా వచ్చిన డబ్బుతో కట్నం, పెళ్లి ఖర్చులు సరిపెట్టచ్చు. బంగారం కొనడానికి, బట్టలకు డబ్బు ఎలా అడ్జస్ట్ చేయాలి? ఆలోచనలతో సతమతమవుతూ ఎప్పుడో అప్రయత్నంగా నిద్రలోకి జారుకున్నాడు రాజేంద్ర.

ట్రైను రాత్రి మూడుగంటల ప్రాంతంలో నెల్లూరు చేరుకుంది. తన బేగ్‌తోపాటూ సఫారీ సూట్‌వాలా అందించిన సూట్‌కేసు తీసుకొని రాజేంద్ర ట్రైన్ డోర్ వైపు నడిచాడు. ప్రయాణీకులంతా గాఢనిద్రలో వున్నారు. ఆ సరికే పిల్లికళ్ల వ్యక్తి తన లగేజితో ట్రైన్ దిగి ప్లాట్‌ఫామ్ పై వున్నాడు. రాజేంద్ర చేతిలోని సూట్‌కేసు తనకందివ్వమని చెయ్యి చాపి, అభ్యర్ధనగా చెప్పాడు. ''మీరు పడుకున్న బెర్త్ కింద నా గ్రే కలర్ సూట్‌కేస్ వుంది. కొంచెం తెచ్చి పెట్టండి. రైలు ఇక్కడ రెండు నిమిషాల కన్నా ఎక్కువ ఆగదు.''

రాజేంద్ర పెళ్లి సూటు వున్న సూట్‌కేస్ ఆ వ్యక్తికందజేసి, మళ్లీ తన బెర్త్ వైపు నడిచాడు. సీటు కింద వున్న గ్రేకలర్ సూట్‌కేసు తీసుకొని వచ్చి ట్రైన్ దిగాడు. కనుచూపు మేరలో ఎక్కడా పిల్లికళ్ల వ్యక్తి కనబడలేదు. ప్రక్కనే వున్న లగేజ్ బుక్కింగ్ గదిలోంచి అతను బయటకు వెళ్లిపోయినట్లున్నాడు.


రాజేంద్రకు గుండెలు జారిపోయాయి. పోయిన వస్తువు తనది కూడా కాదు. అనవసరంగా ఈ లంపటాన్ని నెత్తికి తెచ్చుకున్నాను అనుకున్నాడు. ఇంతలో ట్రైన్ బయలుదేరింది. రాజేంద్రకు కాళ్లు వణుకుతూ ముచ్చెమటలు పోయసాగాయి. ఇంతలో ఎవరో తన భుజం పట్టుకుని కుదపడంతో ఉలిక్కిపడ్డాడతను.

''రాజేంద్ర అంటే మీరేనా?'' నీలి రంగు సఫారీ సూట్‌లో వున్న వ్యక్తి కరుగ్గా ప్రశ్నించాడు. అప్రయత్నంగా తలవూపాడు రాజేంద్ర. అతని గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

ఆ వ్యక్తి రాజేంద్రతో కరచాలనం చేసి చెప్పాడు. ''హైదరాబాద్ నుంచి మా బ్రదర్ ఫోన్ చేసి స్టేషన్లో మిమ్మల్ని కలవమన్నాడు. మా అన్నయ్య ఇచ్చిన సూట్‌కేస్ ఏదీ? పెళ్లి కొడుకు వేసుకోవాల్సిన సూటు గురించి అందరూ కంగారు పడుతున్నారు''

రాజేంద్రకు కాసేపు నోరు పెగల్లేదు. ధైర్యం తెచ్చుకుని ఎలాగో చెప్పాడు. ''సూట్‌కేస్ పోయింది. మాతోబాటు ట్రావెల్ చేసి ఇక్కడే దిగిన మనిషి ఎత్తుకుపోయాడు. ఐదు నిమిషాలు కూడా కాలేదు. పదండి వెదుకుదాం'' అన్నాడు.

ఆ వ్యక్తి కోపంగా రాజేంద్ర భుజాలు పట్టుకుని కుదుపుతూ అన్నాడు. ''ఏయ్, ఏంటి మాట్లాడుతున్నావు నువ్వు, సూట్‌కేస్ దాచిపెట్టి నాటకాలాడుతున్నావా? మేమెవరో,



## డాన్సర్‌గా లయ

**ఇటీవలే అమెరికా డాక్టర్‌ని పెళ్లాడి సినిమాలకి గుడ్‌బై చెప్పేసిన లయ ఇకపై తనకి ఏమాత్రం అవకాశం వున్నా శాస్త్రీయ నృత్య ప్రదర్శనలిస్తానంటోంది. తను అత్తారింటికి వెళ్లడానికి ఇంకా వీసా సమస్య సెటిల్ కాలేదని, అది క్లియర్ కాగానే అమెరికా వెళ్లిపోతానంటున్న లయ- డాన్స్ ప్రోగ్రాంల కోసం మాత్రం ఇండియాకి తరుచూ వస్తుంటానంటోంది. ఈ విషయంలో తన శ్రీవారు, అత్తామామల నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేవు కాబట్టి శాస్త్రీయ నృత్యకళాకారిణిగా మంచి పేరు తెచ్చుకోవాలనుకుంటోంది లయ. మరో ఫ్లాష్ న్యూస్ ఏమిటంటే ఓ టీవీ చానెల్లో రమ్యకృష్ణ హోస్ట్‌గా వున్న ఓ బంగారం ప్రోగ్రాంకి కొత్త హోస్ట్‌గా లయ ఎన్నికైందిట.**

మా పవరేంటో తెలుసా నీకు. ఒళ్లు చితగ్గొట్టి, చేతులు విరిచేయగలను. మర్యాదగా మా సూట్‌కేస్ మా కప్పగించు'' ఆవేశంతో వూగిపోతున్నాడతను.

రాజేంద్ర దీనంగా అన్నాడు. ''సార్, అంతా నా ఖర్మ అనుకోండి. ఆ దొంగ ఎంతో దూరంగా వెళ్లుండడు. పదండి, వెదుకుదాం''

ఆ మనిషి కొంచెం శాంతపడినట్లు వుంది ''సరే పద'' అన్నాడు.

''ఒక్క నిమిషం సార్, నేను ఆ దొంగ మాటలు నమ్మి ఈ గ్రేకలర్ సూట్‌కేస్ తీసుకొని ట్రైన్ దిగేశాను. ఇది నాదీ కాదు, ఆ దొంగదీకానట్లుంది. ట్రైన్లో మరెవరిదో ఐనట్లుంది. దీన్ని రైల్వేపోలీసులకు హేండోవర్ చేసి వెళ్లిపోదాం'' అన్నాడు రాజేంద్ర.

నీలిరంగు సూట్‌లో గిరజాల జుట్టుతో వున్న ఆజానుబాహుడికి తిక్కరేగినట్లుంది. ''అసలు మతుండే మాట్లాడుతున్నావా? ఆ సూట్‌కేస్ ఎవడిదో, ఏమో, అవతల పారేయ్. మర్యాదగా వచ్చి ఆ దొంగను పట్టి చూపించు, లేదా నా సంగతి నీకు తెలీదు, తోలు వలుస్తా'' అని రాజేంద్ర చెయ్యి పట్టుకొని లాగాడు.

ఏదో గొడవ జరుగుతున్నట్లుండడంతో యూనిఫామ్‌లో వున్న స్థూలకాయుడైన ఒక రైల్వే పోలీసు కానిస్టేబుల్ అటుగా రాసాగాడు.

''ఏం జరుగుతోందిక్కడ, ఒరే యాకూబ్ నువ్వున్నావేంట్రా ఇక్కడ?'' అని గిరజాల జుట్టువున్న వాణ్ణి చూసి అరిచాడు.

పోలీసు రాక గమనించిన సూట్‌వాలా రాజేంద్ర చెయ్యి వదిలి పక్కనే వున్న రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్లు గబగబా ఎక్కసాగాడు. ఆసరికి లావుపాటి పోలీసు అక్కడకు చేరుకున్నాడు.

రాజేంద్ర మెదడు చురుగ్గా పనిచేసింది. పోలీసును చూసి ఈ జుట్టుపోలిగాడు ఎందుకు జారుకుంటున్నట్లు?

''సార్, కాస్త ఈ సూట్‌కేసు పట్టుకోండి'' అని కానిస్టేబుల్‌కు గ్రేకలర్ సూట్‌కేస్ నందజేసి నీలిరంగు సూట్‌లో వున్న వ్యక్తిననుసరించసాగాడు. రాజేంద్ర తన వెనకే మెట్లు ఎక్కడం చూసి ఆ వ్యక్తి పరుగులంకించుకొని, రైల్వే బ్రిడ్జి దాటి మెట్లు దిగసాగాడు.

రెండు నెలల నుంచీ పరుగెత్తడం ప్రాక్టీసు చేసి వున్నాడు రాజేంద్ర. క్షణాల్లో ఆ దుండగుడి వెనకాల వున్నాడు. ఆ సరికి మెట్లన్నీ దిగి జారుకోబోయాడా ఆజానుబాహుడు. ఆరో మెట్టు నుంచి రాజేంద్ర ఆ వ్యక్తి పైకి లంఘించి కింద పడదోశాడు. ఆ వ్యక్తి దుస్తుల్లోంచి ఒక చిన్న స్టీల్ కత్తిని తీసి అకస్మాత్తుగా రాజేంద్రపై దాడి చేశాడు.

రాజేంద్ర ఛాతీపై, చేతులపై గాయాలయ్యాయి. రక్తం ధారగా కారసాగింది. అయినా లేని ఓపిక తెచ్చుకొని గిరజాల జుట్టువాడిని తన బాహుబంధంలో గట్టిగా బంధించాడు. మరో చేత్తో కత్తి వున్న చేతిని పెడరెక్కలు విరిచి పట్టుకున్నాడు.

ఆ సరికి అక్కడ మూగిన ప్రయాణీకులు, జనం పోలీసు కానిస్టేబుల్ సాయంతో యాకూబ్ అనే ఆ దుండగుణ్ణి బంధించారు.

''వీడి పేరు యాకూబ్, పేరు మోసిన టెర్రరిస్టు. మొదట్లో రైళ్లలో చిన్న నేరాలు చేసి మా రికార్డులలోకి ఎక్కాడు. ఏడాది నుంచి తీవ్రవాద కార్యకలాపాలు చేస్తున్నాడని తెలిసింది'' యాకూబ్ చేతికి సంకెళ్లు తగిలిస్తూ అన్నాడు పోలీసు కానిస్టేబుల్ వీరాస్వామి.

రాజేంద్ర సహాయంతో యాకూబ్‌ను తీసుకొని వచ్చి ఆర్పీఎఫ్ స్టేషన్లో వుంచి తనపై అధికారులకు ఫోన్ చేశాడు వీరాస్వామి. ఐదు నిమిషాల్లోనే ఆ స్టేషన్లో సందడి మొదలయ్యింది.

స్టేషన్లో వున్న ఒక పోలీసు శునకం గ్రే కలర్ సూట్‌కేస్ చుట్టూ అరుస్తూ తిరగసాగింది. ''సార్ ఈ సూట్‌కేసులో దీన్ని పోగొట్టుకున్న వ్యక్తి ఫోన్ నెంబరు వుండచ్చు'' చెప్పాడు రాజేంద్ర.

జాగ్రత్తగా సూట్‌కేస్ తెరవబడింది. కొన్ని బట్టలు, కాగితాలు తప్ప ఏమీ లేవందులో. ఐనా స్నిఫర్ డాగ్ గట్టిగా అరవసాగింది.

రైల్వే ఎస్ఐ సూట్‌కేస్ అడుగున వున్న క్లాత్ కవర్‌ను జాగ్రత్తగా కోశాడు. కవర్ అడుగున బ్రౌన్ కలర్ పొడితో వున్న కొన్ని పేకెట్లు వరసగా పేర్చబడి వున్నాయి.

''మైగాడ్, బ్రౌన్ షుగర్ పాకెట్స్ ఇవి. నీ చేతికెలా వచ్చిందీ సూట్‌కేస్?'' రాజేంద్రను అడిగాడా ఎస్.ఐ. ఆసరికి అక్కడికి చేరుకున్న ఒక డాక్టరు రాజేంద్ర గాయాలకు ప్రథమ చికిత్స చేయసాగారు.

క్లుప్తంగా తనకెదురైన అనుభవాల గురించి వివరించాడు రాజేంద్ర. పిల్లికళ్ల వ్యక్తి తనను మభ్యపెట్టి గ్రేకలర్ సూట్‌కేసును ట్రైన్ నుంచి తనతో దింపించిన వైనాన్ని ఎస్.ఐ.కి చెప్పాడు. సావకాశంగా అంతా విన్నాడు ఎస్.ఐ.

''సార్, ఈ పేపర్లలో చిన్న పాకెట్ సైజ్ డైరీ వుంది. అందులో నాగరాజు అన్న పేరు, కొన్ని ఫోన్‌నెంబర్లు వున్నాయి'' అన్నాడు వీరాస్వామి.

''ఔను సార్, చార్ట్‌లో నేను నాగరాజు అనే పేరు గమనించాను. బహుశా నాపై మిడిల్ బెర్త్‌లో పడుకున్న కోరమీసాల శాల్తీదై వుండవచ్చు సూట్‌కేస్'' అన్నాడు రాజేంద్ర. ఎస్.ఐ. సాలోచనగా తలపంకించాడు.

తరువాతి స్టేషన్‌కు వెంటనే కబురు వెళ్లింది, ''ట్రైన్‌లోని ఎస్-5 బోగీలో వున్న నాగరాజు అనే వ్యక్తిని అరెస్ట్ చేయమని''

ఇంతలో చెవులు చిల్లులుపడే పేలుడు వినిపించింది. అందరూ వులిక్కిపడ్డారు. యాకూబ్‌ను కటకటాల వెనక్కు తోసి ఇద్దరు కానిస్టేబుళ్లను కాపలాగా వుంచి ఎస్.ఐ. రాజేంద్ర, మరో నలుగురు కానిస్టేబుళ్ళు స్టేషన్ బయటకు పరుగు తీశారు.

రైల్వేస్టేషన్ సమీపంలోని ఒక బిల్డింగ్‌లోంచి వచ్చిందా పేలుడు. ఆ భవనం మేడమీదవున్న సింగిల్‌రూమ్, అందులోని వస్తువులు తునాతునకలై వున్నాయి. ఆ వస్తువుల మధ్య భీకరంగా పడి వుందా శవం.

పిల్లికళ్లు బట్టి ఆ వ్యక్తి తన దగ్గర సూట్‌కేసు దొంగిలించిన వ్యక్తిగా గుర్తించాడు రాజేంద్ర. అతని దగ్గర్లోనే ఆ సూట్‌కేసు, అందులోని వస్తువులు చెల్లా చెదురుగా పడివున్నాయి.

బ్రౌన్ కలర్ సూటు ముక్కలతోబాటు, ప్లాస్టిక్ ముక్కలు, నల్లటి పొడి, వైర్లు కలిసిపోయి భీతిగొలుపుతున్నాయి. ముక్కు పగిలే దుర్గంధం వస్తోందా గదిలోంచి.

ఇంటరాగేషన్లో యాకూబ్ అందించిన వివరాలతో హైదరాబాద్‌లో రాజేంద్రకు సూట్‌కేసు అందించిన టెర్రరిస్టు అరెస్టు చేయబడ్డాడు. రైల్వేస్టేషన్లలో, కీలకమైన కూడళ్లలో బాంబులు అమర్చి విధ్వంసం సృష్టించాలన్న ఉగ్రవాదుల ప్రయత్నం భగ్నమయ్యింది.

పాపమా సూట్‌కేసులో ఏదో వుంటుందని ఆశించి తెలివిగా దాన్ని రాజేంద్రనుంచి కొట్టేసిన దొంగ తాను వుంటున్న గదికి చేరుకొని బలవంతంగా సూట్‌కేసు తెరవబోగా, సూటు కింద దాచిన బాంబులు బద్దలయ్యాయి. ఈవిధంగా ఆ పిల్లికళ్ల దొంగ ప్రాణం మట్టిలో కలిసిపోయింది. ప్రాణాలకు తెగించి యాకూబ్ అనే ఉగ్రవాదిని పట్టుకొని, ఉగ్రవాదుల పథకాలకు గండి కొట్టడంలో సహకరించిన రాజేంద్రకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటించింది. అలాగే మాదకద్రవ్యాలనూ, వాటి స్మగ్లర్‌ను పట్టుకోవడంలో కీలకమైన సహకారాన్ని అందించినందుకు పోలీసుశాఖ రాజేంద్రకు యాభై వేల రూపాయల బహుమతి అందించింది.

అనంతరామయ్య చెప్పినట్లు అదృష్ట యోగానికి రాజేంద్ర ధైర్యసాహసాలు తోడవడంతో చీకట్లు తొలగి రాజేంద్ర జీవితంలో వెలుగు నిండింది.

చెల్లెలి పెళ్లి నిర్విఘ్నంగా జరిగిన తరువాత పోలీసు ట్రైనింగ్లో చేరిపోయాడు రాజేంద్ర. 'ధైర్య సాహసే లక్ష్మీ' అన్న నానుడి రాజేంద్ర విషయంలో నిజమైంది.